## క్లుప్తంగా

### బొజ్జల సుధీర్‌రెడ్డిపై పరువునష్టం దావా వేస్తా



రేణిగుంట: తాను, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కలసి రూ.వెయ్యి కోట్లు భూకుంభకోణం చేసినట్లు శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై తాను సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమని, నిరూపించలేకపోతే సుధీర్‌రెడ్డిపై పరువునష్టం దావా వేయనున్నట్లు హైకోర్టు న్యాయవాది పేరూరు మునిరెడ్డి స్పష్టం చేశారు.మండలంలోని అన్నాసామిపల్లెలో ఆయన ఇంటి వద్ద గురువారం విలేకర్లతో మాట్లాడారు. అన్నాసామిపల్లె, కరకంబాడి, చెంగారెడ్డిపల్లెలో తాను ప్రభుత్వ భూములను కాజేసి రూ.వెయ్యి కోట్లు స్కాం చేశానని ఆరోపణలు చేసి, రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. అన్నాసామిపల్లె సర్వే నంబరు: 385లోని 35 ఎకరాలు భూమి తన పిత్రార్జితమని, 1986లో పట్టా ఇచ్చారని స్పష్టంచేశారు.

### ఆలయ జీర్ణోద్ధరణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి: కైలాసగిరుల్లోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీకాలభైరవస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులను గురువారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 25న ఈ ఆలయంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈలోపు త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పవన్‌కుమార్, కుమార్, ఆలయ పూజారి మోహన్‌శర్మ, ప్రముఖులు కుమారస్వామి, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

### బీసీ హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక బీసీ హాస్టల్ ప్రవేశాల కోసం ఇప్పటివరకు 30మంది దరఖాస్తులు ఇచ్చారని వార్డెన్ రామయ్య తెలిపారు. హాస్టల్‌లో ప్రభుత్వం మెనూ అమలు చేస్తోందని, మంచి పౌష్టికాహారం పెడుతున్నట్టు చెప్పారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**మోడల్ స్కూల్‌లో..**

కేవీబీపురం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 6, 7, 8తరగతుల ప్రవేశాలకుగాను విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ లేదా నేరుగా సంప్రదించి ఈ నెల 26లోపు దరఖాస్తులను ఇవ్వాలన్నారు. 28న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని, మార్కులు, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్టు తెలియజేశారు.

### వడ్డీరాయితీ సద్వినియోగం చేసుకోండి



పన్ను చెల్లిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలో పన్నుదారులు వడ్డీరాయితీని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ బాలాజీనాయక్ కోరారు. గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో ఆర్టీసీ అధికారులు రూ.2.50లక్షలు వడ్డీ లేకుండా పన్ను చెల్లించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులు, కుళాయి పన్నులు ఈ నెల 30వ తేదీలోపు వడ్డీ లేకుండా చెల్లించాలన్నారు. జూలై నుంచి వడ్డీతోపాటు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో పురపాలకసంఘ అధికారులు నారాయణరెడ్డి, రవికాంత్, బాలచంద్రయ్య, తస్లీమా తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి 'జగనన్న సురక్ష'

- ఇంటింటా సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల గుర్తింపు
- సచివాలయాల వారీగా గ్రామసభలు
- ఇంటింటికీ వెళ్లి సర్వే చేయనున్న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది



జగనన్న సురక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు

వరదయ్యపాళెం: సాంకేతిక ఇబ్బందులు, ఇతర కారణాలతో ఆగిపోయిన సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ‘జగనన్న సురక్ష’ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో దీనిని లాంఛనంగా ప్రారంభించనున్నారు. పలు కారణాలతో తప్పిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు జగనన్న సురక్ష పథకం ఒక వరంగా మారనుంది. సచివాలయాల వారీగా గ్రామస్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఇంటింటికీ వెళ్లి సమస్యలను గుర్తించనున్నారు. పలు కారణాలతో ఆగిపోయిన సర్టిఫికెట్లు, పథకాల వర్తింపు గురించి అక్కడికక్కడే ప్రభుత్వ అధికారులు నిర్ధారించనున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పాటై పర్యటిస్తారు. ఈ బృందాలు మండలంలోని 13 సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తారు. ఈ సభల్లో గుర్తించిన సమస్యలు పథకాల వర్తింపునకు మంజూరు పత్రాలను పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి వరదయ్యపాళెం మండలంలో జగనన్న సురక్ష టూర్ షెడ్యూల్‌ను అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జరిగే ఈ కార్యక్రమం పేద ప్రజలకు అండగా నిలవనుంది. పథకాలు అందుకోని లబ్ధిదారులు సైతం ఈ పథకం కోసం ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

**'జగనన్న సురక్ష'లో దరఖాస్తు చేసుకుంటే ఇచ్చే ధ్రువీకరణ పత్రాలు**

1) కుల ధ్రువీకరణ పత్రం
2) ఆదాయ ధ్రువీకరణ పత్రం
3) జనన ధ్రువీకరణ పత్రం
4) మరణ ధ్రువీకరణ పత్రం
5) వివాహ ధ్రువీకరణ పత్రం
6) కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం
7) ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్
8) కౌలు రైతు హక్కుల కార్డు
9) క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు (సీసీఆర్‌సీ), కొత్త బియ్యం కార్డు, బియ్యం కార్డు విభజన, మ్యాపింగ్‌లో ఒకే సభ్యుడు, వితంతువు విభజన

**దరఖాస్తు చేసుకుంటే వర్తించే పథకాలు**

1) జగనన్న వసతి, విద్యా దీవెన
2) వైఎస్సార్ ఈబీసీ నేస్తం
3) వైఎస్సార్ కాపు నేస్తం
4) వైఎస్సార్ చేయూత
5) వైఎస్సార్ పెన్షన్ కానుక
6) వైఎస్సార్ రైతు భరోసా
7) జగనన్న చేదోడు
8) జగనన్న అమ్మఒడి
9) వైఎస్సార్ మత్స్యకారుల భరోసా
10) వైఎస్సార్ వాహనమిత్ర
11) వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా
12) వైఎస్సార్ నేతన్న నేస్తం

**సద్వినియోగం చేసుకోండి**

జగనన్న సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. జూలై 1 నుంచి అన్ని గ్రామ సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తాం. ఈ ప్రత్యేక క్యాంపుల్లో ప్రధానంగా 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఎలాంటి సర్వీసు చార్జీలు వసూలు చేయకుండా మంజూరు చేస్తాం. వలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బంది ఈ నెల 24 నుంచి ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం గురించి వివరిస్తాం.

–సుబ్రమణ్యం రాజు, ఎంపీడీఓ, వరదయ్యపాళెం

## 'జగనన్న సురక్ష' విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ చిన్నా

వరదయ్యపాళెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయడంలో గ్రామ వలంటీర్లు కీలకపాత్ర పోషించాలని మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండలంలోని ఇందిరానగర్, కాంబాకం సచివాలయాల్లో గ్రామ వలంటీర్లు, గృహ సారథులతో సమావేశమయ్యారు. సాంకేతిక కారణాలతో గతంలో సంక్షేమ పథకాల మంజూరుకు నోచుకోని పేద కుటుంబాల లబ్ధిదారులను గుర్తించి అధికారుల దృష్టి తీసుకురావాలన్నారు. నెల పాటు జరిగే ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, స్థానిక సర్పంచులు వీరభద్రం, దీప, అలీ పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అంజూరు, ఆర్డీఓ

శ్రీకాళహస్తి: స్థానిక చెన్నైరోడ్డులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నుంచి జూలై 5వ తేదీ వరకు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ముఖ్యమైన రోజుల్లో భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయంలో క్యూలను పటిష్టపరచాలన్నారు. గతంలో అగ్నిగుండం వెడల్పు తక్కువగా ఉండేదన్నారు. తాను చైర్మన్‌గా అయ్యాక సుమారు పది అడుగుల వెడల్పు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామారావు, ఆలయ పూజారి పురుషోత్తం, ప్రముఖులు హరినాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



సత్యవేడు: నడివీధి గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

సత్యవేడు: మండలంలోని కాళమనాయుడుపేట పంచాయతీలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన బుధ, గురువారం వైభవంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం అమ్మవారి విగ్రహం గణపతి ఆలయం సమీపంలో మండలం రోజులు ధాన్యం, ధనం, నీటిలో ఉంచారు. బుధవారం శుద్ధజలంతో శుభ్రం చేసి వీధి మలుపుల్లో వేపాకు తోరణాలు కట్టారు. సాయంత్రం గ్రామ పరిధిలో పెద్ద ఎత్తున మేళతాళాల సందడితో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. అర్ధరాత్రి నడివీధి గంగమ్మను ప్రతిష్ఠించారు. అంతకు ముందు గణపతి, సుమంగళి, నవగ్రహ, శివ, గోపూజలు చేశారు. గురువారం ఉదయం, సాయంత్రం భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. గ్రామ శెట్టి పృథ్వి, త్రివిక్రమరావు, నాప చెంగల్రాయం, ఉమ్మిటి బాలగుర్రప్ప, రెడ్డి దేవరాజులు ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి బంధుమిత్రుల రాకతో ఇంటింటా సందడి నెలకొంది.

**గంగమ్మ ఆలయంలో పవిత్రారెడ్డి పూజలు**

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద ఎస్సీకాలనీ గంగమ్మ ఆలయంలో గురువారం తొట్టంబేడు మండల కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి పూజలు చేశారు. గ్రామస్తుల ఆహ్వానంపై ఆమెకు జాతర వేడుకలకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుధీర్‌కుమార్, మస్తాన్, గోపి, ఈశ్వర్, మణి, శివ, జయప్రకాష్, ధనుంజయరెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పళ్లికొండేశ్వరుని సేవలో దేవదాయ శాఖ ఆర్జేసీ




గోపూజ చేస్తున్న ఆర్జేసీ దంపతులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరస్వామిని దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ సాగర్‌బాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి వారికి స్వాగతం పలికారు. ఆలయంలో గోపూజ అనంతరం స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిగ, దాంపత్య దక్షిణామూర్తి, మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామిలను వారు దర్శించుకున్నారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో రథం, కోనేరు, రథం షెడ్డు, వసతి గృహాల అభివృద్ధి పనులను సాగర్ బాబు పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్, ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి, బోర్డు సభ్యులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా అరికట్టండి

రేణిగుంట: మండలంలో జీపాళెం సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అధికారులు అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. జీపాళెం సమీపంలో ఆయన గురువారం సీపీఐ నాయకులు, స్థానికులతో కలసి పరిశీలించారు. తమ కళ్లముందే జేసీబీలు, ఇటాచీలు, ట్రాక్టర్లు పెట్టి ఇష్టారాజ్యంగా ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు.

## క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని పెద్ద కన్నలి ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఆర్థిక ప్రణాళిక, బ్యాంకు సేవలు సద్వినియోగం అనే అంశంపై ఎంఈఓ కార్యాలయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విశాల్, జ్యోతీశ్వర్ మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రూ.5వేలు నగదు పురస్కారం, సర్టిఫికెట్లను అందుకున్నారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దామోదరం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## కనీస వేతనాల పెంపు చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకుంటున్న కార్మికులు

శ్రీకాళహస్తి: తిరుపతి ఉప కార్మికశాఖ బాబునాయక్ ఆధ్వర్యంలో గురువారం కనీస వేతనాల చెక్కులను కార్మికులకు పంపిణీ చేశారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ కార్మికుల వేతనాల కోసం గౌరవాధ్యక్షుడు మునెయ్య నిరంతరం కృషి చేసి పోరాడారని, కోర్టు నుంచి కనీస వేతనాలకు మద్దతుగా తీర్పు వచ్చిందన్నారు. ఇందుకు ఉభయరాష్ట్రాల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు రత్నకుమార్ ఎంతో సహకరించారన్నారు. అనంతరం వారు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్మిక అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

### అభినందన



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని ఎంజీఎం పాఠశాల విద్యార్థిని ఎం.డింపు శివానిని డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అభినందించారు. యోగా దినోత్సవం సందర్భంగా వృక్షాసనం ఎక్కువ సమయం వేసి జాతీయ రికార్డు సాధించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆ విద్యార్థినిని, యోగా గురువును అభినందించారు.

### భూమిపూజ



శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. హైజంప్, లాంగ్ జంప్‌లో పలువురు రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు వాసుదేవరావు రూ.20వేలతో హైజంప్, లాంగ్ జంప్ పిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చారు. గురువారం దీనికి సంబంధించి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్, టీచర్లు పాల్గొన్నారు.

## సంక్షేమానికి సీఎం పెద్దపీట



మసీదులో కరపత్ర ప్రచారం చేస్తున్న లతీఫ్

వరదయ్యపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని వక్ఫ్ బోర్డు కార్యదర్శి లతీఫ్ అన్నారు. ముస్లింల సమస్యల గుర్తించడానికి నియోజకవర్గంలోని మసీదులను సందర్శించి ముస్లిం మైనారిటీలతో సమావేశమవుతున్నట్లు ఆయన చెప్పారు. మైనారిటీల అభ్యున్నతికి సీఎం తీసుకొచ్చిన పథకాలు, అభివృద్ధి గురించి కరపత్రాల ద్వారా వారికి వివరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# సీఎంను కలిసిన ఆదిమూలం



సీఎం జగన్‌తో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలిశారు. వరదయ్యపాళ్యం మండలం కువ్వాకొల్లిలోని సీసీఎల్ పరిశ్రమను సీఎం వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎంతో తనతో పంచుకున్న విషయాలను ఆయన ‘సాక్షి’కి చెప్పారు. పెద్ద ఎత్తున ప్రారంభం కానున్న ‘జగనన్న సురక్ష’ను నియోజకవర్గంలో విజయవంతంగా నిర్వహించాలని సూచించారని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేయడంలో వంద శాతం సఫలీకృతం కావాలని జగనన్న ఆదేశించారని, అలాగే ప్రతిపక్షం, ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టడానికి, వాస్తవాలను ప్రజలకు చేరవేయడానికి వార్డు స్థాయి నుంచి సోషల్ మీడియాను విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారని అన్నారు.

# భయంతోనే టీడీపీ తప్పుడు ఆరోపణలు

- పచ్చమీడియా తప్పుడు రాతలను మహిళలు తిప్పికొడతారు
- టీడీపీ హయాంలో పక్కదారి పట్టిన రూ.2.32 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

కేవీబీపురం: ఓటమి భయంతోనే తెలుగుదేశం పార్టీ నేతలు వారి తోక పత్రికలను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి మండిపడ్డారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అధికారులు, సంఘమిత్రలు చేతివాటం చూపుతున్నారని, డ్వాక్రా గ్రూపుల డబ్బు పక్కదారి పడుతోందంటూ టీడీపీ తోక పత్రిక అవాస్తవ కథనాన్ని ప్రచురించిందని ఆమె గురువారం వెలుగు కార్యాలయంలో సిబ్బందితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనను అందించడాన్ని ఓర్వలేక టీడీపీ నేతలు పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నా వడ్డీ రుణాలు పొందిన డ్వాక్రా గ్రూపులు తిరిగి చెల్లిస్తున్నాయని, మంజూరు చేసిన రుణాల సొమ్మును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తుంటే, ఇక అవినీతికి చోటెక్కడని, పచ్చమీడియా ఆ మాత్రం ఇది తెలియదా? అని ఆమె ప్రశ్నించారు.

**టీడీపీ హయాంలో అంతులేని అవినీతి**

టీడీపీ హయాంలో మండల ముఖ్యనేతలుగా ఉన్న వారు ఇదే వెలుగు, డ్వాక్రా గ్రూపులను అడ్డుపెట్టుకుని రూ.2.32 కోట్లను కొల్లగొట్టారని ఆమె ఆరోపించారు. కోవనూరు, కర్లపూడి గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ వర్గాల సంతకాలను ఫోర్జరీ చేసి వారికి చేరాల్సిన డ్వాక్రా సొమ్మును అప్పటి జెడ్పీటీసీ స్వాహా చేయడం వాస్తవం కాదా? అని నిలదీశారు. రాయపేడు నుంచి ఓళ్లూరు, పాతపాళెం గ్రామాల వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటలేదని, అయితే నాటినట్లు రూ.16 లక్షలు మింగేసినపుడు ఎందుకు మీ గళం వినిపించలేదని తోక పత్రికను ప్రశ్నించారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీల పేరుతో కార్పొరేషన్ సబ్సిడీలతో వచ్చిన ఇన్నోవా కార్లను టీడీపీకి చెందిన ఓసీ, బీసీ నేతలు సొంతం చేసుకుని ఇప్పటికీ బాడుగల రూపంలో ఉపాధి పొందుతున్నారని, దీనిని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించారని నిప్పులు చెరిగారు. అంతటితో ఆగక ట్రాక్టర్లు, వరికోత మెషిన్లను సైతం అక్రమంగా దక్కించుకుని అమ్ముకుతిన్న దిగజారుడు నేతలు ఇప్పుడు చిలక పలుకులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ ప్రభుత్వం నిత్యం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడిందని, వాటిలో వందల సంఖ్యలో టీడీపీ కుటుంబాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు పద్ధతి మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. సమావేశంలో మండలంలోని సంఘమిత్రలు, పార్టీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ





తహసీల్దార్ శ్రీదేవి, ఎంఈఓ ఉషా

కేవీబీపురం: తహసీల్దార్‌గా శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి ఏర్పేడు మండలానికి బదిలీ అయ్యారు. సత్యవేడు నుంచి శ్రీదేవి ఇక్కడికి బదిలీపై బాధ్యతల స్వీకరణ అనంతరం అధికారులు, వీఆర్‌ఓలతో ఆమె సమావేశమయ్యారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫైళ్లపై దృష్టి సారిస్తానన్నారు. తొలుత కార్యాలయ సిబ్బంది, అధికారులు, పలు పార్టీల నాయకులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీటీ మునిరత్నం, ఆర్‌ఐ సుబ్రమణ్యం, సిబ్బంది నీలకంఠం, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడులో ఎంఈఓ-2...**

సత్యవేడు: మండల విద్యాశాఖ అధికారి-2గా కె.ఉషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెతోపాటు ఎంఈఓ-1 రవిని ఎస్‌టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ యూనియన్ నాయకులు గురునాథం, వెంకటేశ్వర్లు, మణి, కోటీశ్వరం, మునిరాజ, దుర్గాప్రసాద్, ప్రభావతి, శ్రీనివాసులు, మునిమోహన్, మొహిద్దీన్, దాము, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన నిర్మాణాలు పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేడు: పంచాయతీలకు మంజూరైన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ వి.ప్రతిమ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచులు, కాంట్రాక్టర్లు, సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో ఎంపీపీ సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో 96 పనులకు రూ.1.69 కోట్లు మంజూరైన నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మండలంలో 42 ప్రభుత్వ భవనాలు మంజూరైతే మదనంబేడులో రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, ఇరుగుళంలో సచివాలయ నిర్మాణం పూర్తి చేశారన్నారు. మిగిలిన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసి పంచాయతీలలో ప్రభుత్వ కార్యాలయాలకు భవన వసతులు కల్పించాలని సర్పంచులు, ఎంపీటీసీలను ఆమె కోరారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే. చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్‌రావు, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు : ఆర్డీఓ



అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ, అధికారులు

కేవీబీపురం: ప్రజలకు వైద్యసేవలు అందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలో పర్యటించారు. కోవనూరు, కేవీబీపురం ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. పీహెచ్‌సీ సేవలపై ఆరా తీశారు. అలాగే మండల కేంద్రంలోని పలు పాఠశాలలను సైతం తనిఖీ చేసి, విద్యార్థులకు ఉన్న భోజన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాగిగుంటలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు.

**అగ్నిమాపక కేంద్రానికి స్థల పరిశీలన**

మండలంలో ఒక అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గతంలో అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ప్రభుత్వం స్పందించింది. అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు అనుమతించింది. ఈ నేపథ్యంలో రాగిగుంట కూడలికి సమీపంలో ఉన్న 22 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్డీఓ, రెవెన్యూ అధికారుల బృందం పరిశీలించింది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీదేవి, డీటీ మునిరత్నం, ఆర్‌ఐ సుబ్రమణ్యం, వీఆర్‌ఓ మనోహర్ పాల్గొన్నారు.